


45.61 టీఎంసీలు నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టులోకి ఎగువ నుంచి 29,928 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టులో 45.61 టీఎంసీలు నిల్వ ఉంది.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్(దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 7713 క్యూసెక్కులు విడుదల చేశారు. తూర్పు కెనాల్‌కు 750 క్యూసెక్కులు వదిలారు.

లక్ష్మీనరసింహునికి పూజలు



బెల్లంకొండ: మండలంలోని కేతవరంలో ఉన్న రాజ్యలక్ష్మీ సమేత వజ్ర లక్ష్మీనరసింహుని ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు.

న్యూస్‌రీల్

నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఓబులేసు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా సీ ఓబులేసును నియమిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనిల్ కుమార్ సింఘాల్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న కె. రాజ్యలక్ష్మిని రెవెన్యూ శాఖలో రిపోర్టు చేయాలని కొద్ది రోజుల క్రితం ఉత్తర్వులు జారీ అయిన విషయం తెలిసిందే. తాజా బదిలీల్లో భాగంగా కమిషనర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ విభాగంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న ఓబులేసును గుంటూరు నగర పాలక సంస్థ అదనపు కమిషనర్‌గా నియమించారు.

నేడు జిల్లా రిజిస్ట్రేషన్ల శాఖ సిబ్బందికి కౌన్సెలింగ్



గుంటూరు వెస్ట్ : స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉమ్మడి జిల్లాకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియకు శనివారం అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం నుంచి జడ్పీ ఆవరణలోని ఆ శాఖ డీఐజీ కార్యాలయంలో ఈ ప్రక్రియ జరగనుంది. సుమారు 70 మంది సబ్ రిజిస్ట్రార్లు, 80 మంది సిబ్బందికి బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. గుంటూరు, ఒంగోలు, నెల్లూరు జిల్లాల డీఐజీ స్థాయి అధికారులతో దీనికోసం కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ చైర్మన్‌గా గుంటూరు జిల్లా డీఐజీ జి.శ్రీనివాసరావు వ్యవహరించనున్నారు. డిమాండ్ ఉన్న పోస్టులకు ప్రజాప్రతినిధుల నుంచి కొందరు ఉద్యోగులు సిఫార్సు లేఖలు తెచ్చుకుంటున్నట్లు సమాచారం. అధికారులు మాత్రం తమకు అందిన మార్గదర్శకాల ప్రకారమే బదిలీలు చేస్తామని చెబుతున్నారు.

రైల్వే టెన్నిస్ టోర్నమెంట్‌లో టైటిల్ కైవసం



రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): గుంటూరు అమరావతిలోని ఆర్‌సీటీ అదనపు రిజిస్ట్రార్ కె.రాజేంద్రప్రసాద్, విజయవాడలోని ఎలక్ట్రికల్ మెయింటెనెన్స్ టెక్నీషియన్ కె.సంపత్ కుమార్‌లు ఆల్ ఇండియా రైల్వే టెన్నిస్ టోర్నమెంట్ వెటరన్స్ విభాగంలో టైటిల్ కైవసం చేసుకున్నారు. ఈ నెల 17 నుంచి 21వ తేదీ వరకు చెన్నైలోని ఐసీఎఫ్‌లో జరిగిన 70వ ఆల్ ఇండియా రైల్వే టెన్నిస్ టోర్నమెంట్‌లో దేశ వ్యాప్తంగా పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. ఉత్కంఠభరితంగా సాగిన డబుల్స్ ఫైనల్ పోటీలో శ్రీనివాసరావు, మునీర్‌లపై రాజేంద్రప్రసాద్, సంపత్‌కుమార్‌లు విజయం సాధించారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

యర్రబాలెంలో భారీ వర్షం

– ఓ ఇంటిపై పడిన పిడుగు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ పరిధిలోని యర్రబాలెం ఎస్సీ కాలనీలో ఓ ఇంటిపై పిడుగు పడింది. సేకరించిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం భారీగా వర్షం కురిసింది. యర్రబాలెంలో నివాసం ఉంటున్న సాలి బంగారయ్య అనే వ్యక్తి నివాసంపై పిడుగు పడింది. బిల్డింగ్‌పై ఒక వైపు పిట్టగోడతోపాటు స్వల్పంగా శ్లాబ్ , గోడలు బీటలు వారాయి. ఇంట్లో విద్యుత్ తీగలు మొత్తం పూర్తిగా కాలిపోయాయి. సుమారు రూ.60 వేల ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపారు.

విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి పూజ

యద్దనపూడి: మండలంలోని గన్నవరం-యనమదల దండు దారి సమీపంలో రూ.2.80 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేస్తున్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, బాపట్ల కలెక్టర్ వెంకట మురళి, స్థానిక ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు శనివారం భూమిపూజ చేశారు. మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు నివారించి రైతులకు, గృహ అవసరాలకు నిరంతరంగా విద్యుత్ సరఫరా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. సబ్ స్టేషన్ నిర్మాణం పూర్తయితే మార్టూరు, యద్దనపూడి మండలాల్లోని 10 గ్రామాలకు పైగా లోవోల్టేజీ సమస్య తీరుతుందని చెప్పారు. అనంతరం యనమదలలో రూ.65 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఆర్డీఓ రవీంద్రబాబు, విద్యుత్ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ, డీఈ నల్లూరి మస్తాన్‌రావు, ఈఈ శ్రీనివాసరావు, ఏడీ సురేంద్రబాబు పాల్గొన్నారు.

కనికరం లేని కూటమి సర్కారు తీరుతో రైతులకు వెతలు తప్పడం లేదు. ఈ ఖరీఫ్ సీజన్‌లోనే రెండు సార్లు భారీ వానలు, వరదలతో కుదేలయ్యారు. సాయం విషయంలో కూటమి ప్రభుత్వంతో వారికి అష్టకష్టాలు తప్పడం లేదు. అసలే ప్రకటించే సాయం అరకొర.. ఆపై అంచనాల్లో కోతలు ఎడాపెడా పెట్టేయడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. కూటమి దెబ్బకు గుండె కోతే మిగులుతోంది. ఇప్పుడు నష్టం అంచనాలు తగ్గించి మరింత వంచిస్తోంది ప్రభుత్వం. కష్టాల సుడిలో చిక్కుకున్న వారిపై కనికరం కూడా చూపడం లేదు. మళ్లీ నిండా ముంచేలా అన్నదాతలపై తనది కపట ప్రేమేనని మరోసారి చాటుకుంటోంది.

సాయం అరకొర.. కోత ఎడాపెడా!

రైతులను మరోసారి నిండా ముంచిన కూటమి సర్కారు

- అంచనాల కుదింపుతో సగం మంది అన్నదాతలకే పరిహారం
- ఈ– క్రాప్ సాకుగా కౌలు రైతులకు తప్పని మొండిచేయి
- జూలైలోనూ భారీ వర్షాలకు రూ.10 కోట్ల మేర నష్టం
- అప్పట్లో సబ్సిడీ విత్తనాలతో సరిపెట్టిన ప్రభుత్వం



ఇటీవల వర్షాలకు చేబ్రోలు మండలంలో నీట మునిగిన వరి పంట

తొలుత	ఇప్పుడు
మొత్తం నష్టం: 1.05 లక్షల ఎకరాలు	మొత్తం నష్టం: 48.44 వేల ఎకరాలు
సాధారణ పంటలు 83,000 ఎకరాలు	45,664.86 ఎకరాలు
ఉద్యాన పంటలు 22,000 ఎకరాలు	2,775.50 ఎకరాలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఒక్కసారిగా పంట నష్టం తగ్గిపోయింది. కేంద్ర బృందానికి ఇచ్చిన అంచనాలు రోజులు గడిచేసరికి సగాని కంటే తక్కువకే పడిపోయాయి. ఎకరానికి రూ.10 వేలు రైతులకు చెల్లిస్తామని ప్రకటించిన కూటమి ప్రభుత్వం... నష్టాన్ని తగ్గించి చూపాలని ఆదేశించడంతో అధికారులు ఆ మేరకు చేశారు. ఇదే ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. ఆగస్టు నెల చివరిలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో ముంపునకు గురైన పంటలలో నష్టం అంచనాలను అధికారులు భారీగా తగ్గించారు. ఈ నెల 12వ తేదీన కేంద్ర బృందం జిల్లాకు వచ్చింది. అప్పుడు జిల్లాలో 83 వేల ఎకరాల్లో వ్యవసాయ, 22 వేల ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందని నివేదికలు రూపొందించారు. నష్టం అంచనాలు సగానికి సగం తగ్గడం గమనార్హం. 33 శాతం కంటే పంట నష్టం తక్కువగానే జరిగిందని, ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండటం వల్ల పంట మొత్తం నష్టపోయిందని తొలుత అంచనా వేశామని అధికారులు అంటున్నారు. పొలాల్లో నీరు తొలిగిన తర్వాత తగు జాగ్రత్తలు తీసుకుంటే పంట నిలదొక్కుకుంటుందని భావిస్తున్నామని తెలిపారు. ఇలా నష్టం తగ్గించి చూపడాన్ని రైతులు వ్యతిరేకిస్తున్నారు. పంట చేతికి వచ్చే పరిస్థితి లేదని వారు చెప్పారు. పరిహారం ఇవ్వకుండా తప్పించుకునేందుకు ప్రభుత్వం ఇలా వ్యవహరిస్తోందని ఆవేదన చెందుతున్నారు. కూటమి సర్కారు వైఖరిని రైతు సంఘాల నేతలు కూడా తప్పుబడుతున్నారు. 80 నుంచి 100 శాతం పంట దెబ్బతిందని కేంద్ర బృందానికి చూపిన విషయాన్ని వారు గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు పంట బాగుందని ఎలా చెబుతారని ప్రశ్నిస్తున్నారు.

రెండు సార్లు కోలుకోలేని దెబ్బలు

ఇప్పటి వరకు గుంటూరు జిల్లాలో వ్యవసాయ పంటలు 45,664.86 ఎకరాలు, ఉద్యాన పంటలకు 2775.5 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అధికారులు నివేదికలు తయారు చేశారు. పంట నష్టం నమోదులో పూర్తి స్థాయిలో కౌలు రైతుల పేర్లు చేర్చకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జూలై మాసంలో భారీ వర్షాలు, ఆగస్టు చివరిలో మరో మారు భారీగా వానలు, వరదలు విరుచుకుపడ్డాయి. వరదలకు గుంటూరు జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇటీవల ముంచెత్తిన వరదలకు జిల్లాలోని 45,664.86 ఎకరాల్లో వరి, మినుము, పత్తి, జొన్న, మొక్కజొన్న, పెసర తదితర పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు తేల్చారు. వీటికి ఎకరాకు రూ.10 వేల చొప్పున రూ.45.67 కోట్లు పరిహారం రైతులకు అందించాలని లెక్కగట్టారు. జూలై మాసంలో కురిసిన భారీ వర్షాలకు సుమారు 12 వేల ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు చేసిన వరి దెబ్బతింది. దాదాపు రూ.10 కోట్ల పరిహారం రైతులకు అందించాల్సి ఉంటుందని అధికారులు అప్పట్లో తేల్చారు. ఆ మేరకు పరిహారం అందించకుండా.. కేవలం సబ్సిడీ విత్తనాలతోనే పాలకులు సరిపెట్టారు.

కౌలు రైతులకు 'ఈ-క్రాప్' చిక్కులు

పంట నష్టం నమోదులో కౌలు రైతుల పేర్లు పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చినా క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. దీంతో కౌలు రైతులు గగ్గోలు పెడుతున్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 60 వేల మంది వరకు కౌలు రైతులు ఉన్నారు. ఇందులో సగం మందికి కూడా ప్రభుత్వం సీసీఆర్‌సీ కార్డులు జారీ చేయలేదు. కార్డులు అందుకున్న వారి పేర్లు మాత్రమే ఈ-క్రాప్‌లో నమోదయ్యాయి. పంట నష్టం నమోదును ఈ-క్రాప్ ఆధారంగానే అధికారులు పూర్తి చేశారు. పేర్లు లేనందున పంట నష్టపరిహారం జాబితాలో తమ వివరాలు చేర్చలేదని రైతులు చెబుతున్నారు. కార్డులు లేని కౌలు రైతుల పేర్లు నమోదు చేస్తే భూ యజమానులు సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో ఘర్షణకు దిగుతున్నట్లు తెలిసింది. దీంతో అధికారులు ఈ-క్రాప్ ఆధారంగానే పంట నష్టం నమోదు చేసినట్లు సమాచారం. దీంతో వాస్తవంగా నష్టపోయిన వారికి పరిహారం అందే పరిస్థితి కనిపించడం లేదు. ఎకరాకు కౌలు పొలాన్ని బట్టి రూ.18 వేల నుంచి రూ.35 వేల వరకు ఉంది. మరోవైపు ఇప్పటి వరకు ఎకరాకు సాగుకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు వరకు ఖర్చు చేశామని ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన కేంద్ర బృందానికి కౌలు రైతులు తమ గోడు చెప్పారు. ముంపునకు గురైన పొలాల్లో డిసెంబర్ వరకు ఎలాంటి పంటలు సాగు చేయడం కుదరదు. దీంతో నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు, కౌలు రైతులు కోరుతున్నారు. పంటనష్టం ఎన్యుమరేషన్ ఇంకా పూర్తి కాకపోవడంతో పరిహారం సొమ్ము ఎప్పటికి చెల్లిస్తారనేది కూడా కీలకంగా మారింది.

నష్టం అంచనాల్లో రాజకీయ జోక్యం



పంట నష్టం అంచనాలలో రాజకీయ జోక్యంతో అర్హులైన వారికి మొండిచేయి చూపుతున్నారు. గ్రామంలో 15 ఎకరాలలో వరి, పత్తి సాగు చేస్తున్నా. భారీ వర్షాలు, వరదల కారణంగా పొలం ముంపు బారిన పడింది. వారం రోజుల పాటు నీట మునిగింది. మొత్తం పంట దెబ్బతింది. పూర్తిగా నష్టపోయాం. నాతోపాటు గ్రామంలో మరికొంత మందికి కూడా నష్టపరిహారం అంచనాలలో అన్యాయం జరుగుతోంది. అధికార పార్టీ నాయకులు చెప్పిన వారికే యంత్రాంగం జాబితాలో చోటు కల్పిస్తోంది.

– యర్రాకుల వీరాంజనేయరాజు,
వీరనాయకునిపాలెం, చేబ్రోలు మండలం

పరిహారం ఎంతో తేల్చి వెంటనే ఇవ్వాలి



వల్లభరావుపాలెం గ్రామంలో ఆరు ఎకరాల్లో వరి సాగు చేస్తున్నా. ఎకరాకు రూ. 13 వేల వరకు ఖర్చు చేశా. వరి నారు, నాట్లు, కలుపు, ఎరువులు, కూలీలు, క్రిమిసంహారక మందుల కోసం ఇప్పటికే రూ. 78 వేలు వెచ్చించా. మరో రెండు నెలల్లో పంట చేతికొస్తుందని చూస్తుండగా వరద పొలాలను ముంచేసింది. మూడు ఎకరాల్లో పంట పూర్తిగా నష్టపోయా. అధికారులు ఆ వివరాలు నమోదు చేశామంటున్నారు. కానీ స్పష్టత లేదు. పరిహారం ఎంత ఇస్తారో కూడా తెలియడం లేదు. ఇకనైనా ప్రభుత్వం అన్నివిధాలా రైతులను ఆదుకోవాలి.

– పక్కల వెంకట కోటేశ్వరరావు,
కసుకర్రు గ్రామం, పొన్నూరు మండలం

ఏదైనా జరిగితే వెంటనే సమాచారమివ్వండి

ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలకు జిల్లా ఎస్పీ సూచన



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

నగరంపాలెం: ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఏదైనా జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ సూచించారు. నగరంలోని ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యజమానులతో శనివారం జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ)లోని హాల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. తొలుత ప్రతి ఒక్కరితో జిల్లా ఎస్పీ మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోందని వారు తెలిపారు. మైనర్ల డ్రైవింగ్, ఈవ్ టీజింగ్, వాహనాలు నడిపే మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ వంటి అంశాలపై చర్యలకు జిల్లా ఎస్పీకి వినతి పత్రం అందించారు. గంజాయికి బానిసైన కొందరు యువత ప్రభావం విద్యార్థులపై పడుతోందని, దీనిపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అన్నివిధాలా అండగా ఉంటామని చెప్పారు. ఏదైనా ఘటన జరిగితే స్థానిక పోలీస్ అధికారులకు, 100 లేదా 86888 31568కు సమాచారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో డీఎస్పీలు రమేష్ (ట్రాఫిక్) బి.సీతారామయ్య (ఎస్‌బీ), సీఐ శ్రీనివాసరావు (ఎస్‌బీ), వెల్ఫేర్ ఆర్ఐ శ్రీనివాసరావు, ఏపీపీఎస్ఏ, ఏపీయూఎస్ఎంఏ నాయకులు కన్న మాస్టర్, మేకల రవీంద్రబాబు, గణేష్ కాటూరి, వెంకటేశ్వరరావు, మంజుల, మస్తాన రావు, నాయుడు చక్రనాగ్, మున్ను రాజేష్, మల్లికార్జునరావు, బత్తిన వెంకటరావు, పోలీస్ అసోసియేషన్ సభ్యులు కరిముల్లా, లక్ష్మణ్, హుస్సేన్ పాల్గొన్నారు.






ఎమ్మెల్యే తరగతి గదిలో.. విద్యార్థినులు వరండాలో..!

పాఠశాల గదిలో టీడీపీ శాసనసభ్యుడి సమావేశం

ఆయనొక ప్రజాప్రతినిధి... విద్యార్థులకు పాఠాలు బోధించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదనే ఇంగిత జ్ఞానం లేకుండా ఏకంగా నగరపాలక సంస్థ పాఠశాల తరగతి గదిలోనే సమావేశం ఏర్పాటు చేశారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం 53వ డివిజన్ వెంగళరావునగర్ మున్సిపల్ బాలికల హైస్కూల్ వద్ద 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా శనివారం బహిరంగ సభ ఏర్పాటు చేశారు. స్కూల్ ముందే పెద్ద పెద్ద మైకులు పెట్టారు. తర్వాత విద్యార్థినులను బయటకు పంపించారు. తరగతి గదిలో సచివాలయ సిబ్బంది, అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ నిర్వాకమిది. దీంతో చేసేదేమీ లేక విద్యార్థినులకు బయట వరండాలోనే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి టీచర్లకు ఎదురైంది. ఒక ప్రజాప్రతినిధి అయి ఉండి.. ఈ విధంగా బాలికలను ఇబ్బందులకు గురిచేయడంపై పలువురు తీవ్రంగా విమర్శిస్తున్నారు. – నెహ్రూనగర్

తమిళనాడుకు తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత



పట్టుబడిన లారీ, రేషన్ బియ్యం

ఒంగోలు టౌన్: ఇటీవల రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా జరుగుతోంది. రాష్ట్రం నుంచి పక్క రాష్ట్రాలకు కూడా తరలిపోతోంది.టంగుటూరు మండలంలోని వల్లూరు సమీపంలో ఎన్‌హెచ్ 16పై విజిలెన్స్ అధికారులు శనివారం దాడి చేసి తమిళనాడుకు చెందిన లారీని పట్టుకున్నారు. అందులో తరలిస్తున్న 26వేల కిలోల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించిన రేషన్ బియ్యాన్ని బ్రోకెన్ రైస్‌గా మార్చి వడ్లమూడి నుంచి తమిళనాడుకు తరలిస్తున్నట్లు విచారణలో తేలింది. వడ్లమూడిలోని శ్రీలక్ష్మీ శ్రీనివాస ట్రేడర్స్ మిల్లు నుంచి తమిళనాడులోని మదురైకి రవాణా చేస్తున్నట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. లారీలోని మొత్తం 520 బ్యాగుల బియ్యం, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఈడీటీ కృష్ణ మోహన్, సీఐ రాఘవరావు తెలిపారు. సీజ్ చేసిన బియ్యాన్ని సింగరాయకొండ ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జికి, లారీని టంగుటూరు పోలీసు స్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉంటేనే బాధితులకు న్యాయం



మధుసూదనరావును సత్కరిస్తున్న దృశ్యం

నరసరావుపేట: చట్టాలపై పూర్తి అవగాహన ఉంటేనే కోర్టుల ద్వారా బాధితులకు న్యాయం సాధ్యమని పల్నాడు జిల్లా ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ మధుసూదనరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక రాధాకృష్ణ కల్యాణ మండపంలో న్యాయ నిపుణులు, పోలీస్ అధికారులు, సిబ్బందికి నిర్వహించిన న్యాయ సహకార సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు విషయాలు వివరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన 39 మంది పీపీలు, ఏపీపీలు పాల్గొన్నారు. మధుసూదనరావుకు మెమోంటో అందజేసి సత్కరించారు. స్థానిక ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి, సత్తెనపల్లి ఏపీపీ బగ్గి నరసింహారావు, డీఎస్పీ కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొమ్మమూరు కాలువలో పెరిగిన నీటి మట్టం

- సాక్షి కథనాలతో అధికారుల్లో కదలిక
- 6.5 అడుగులకు చేరిక
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సాక్షి ఎఫెక్ట్

కారంచేడు: సాగునీటికి అలమటిస్తున్న రైతులు కొమ్మమూరు కాలువలో 6.5 అడుగుల నీటిమట్టం నమోదు కావడంతో వారి ఆనందానికి అవధులు లేవు. సాక్షి దిన పత్రికలో వరుస కథనాల్ని ప్రచురించడంతో అధికారులు మేల్కొన్నారు. కొమ్మమూరు కాలువ ఆయకట్టు కింద పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లోని కారంచేడు, చీరాల, వేటపాలెం, చినగంజాం, నాగులుప్పలపాడు మండలాలకు చెందిన సుమారు లక్ష ఎకరాల్లో అధికారిక, అనధికారిక లెక్కల ప్రకారం రైతులు వరి సాగు చేస్తారు. ప్రధాన సాగునీటి వనరుగా ఉన్న కొమ్మమూరు కాలువ పైనే ఆధారపడుతుంటారు. దీని ద్వారా దిగువనున్న పొలాలకు సాగునీరు సక్రమంగా అందాలంటే కనీసం 6.5 అడుగుల నుంచి 7 అడుగుల నీటిమట్టం అవసరం. అయితే, గత కొన్ని రోజులుగా కొమ్మమూరు కాలువలో కారంచేడు-కుంకలమర్రు రోడ్డులోని యూటీ వద్ద నీటి మట్టం4 నుంచి 5 అడుగులు మాత్రమే నమోదయింది. దీంతో రైతులు లక్షల రూపాయలులు ఖర్చు చేసి వరి చేలకు, నాట్లు వేసుకోవడానికి ఆయిల్ ఇంజన్ల ద్వారా నీటిని పంపింగ్ చేసుకుంటున్నారు. అందుకు రైతులు ఒక్కో ఎకరానికి కనీసం రూ. 2500 నుంచి రూ. 3000 వరకు అదనపు ఖర్చు చేయాల్సి వస్తోంది. విషయాన్ని గమనించిన సాక్షి ' రైతుల ఆశలకు బీటలు' 'కన్నీటి సాగు' వంటి వరుస కథనాల్ని ప్రచురించింది. దీంతో దిగివచ్చిన నీటిపారుదల శాఖాధికారులు శనివారం ఉదయం నుంచి కొమ్మమూరు కాలువలో 6.5 అడుగుల నీటి మట్టం ఉండేలా చర్యలు తీసుకున్నారు. వరుస కథనాలతో అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లిన సాక్షికి రైతన్నలు అభినందనలు తెలిపారు.



కారంచేడు యూటీ వద్ద నీరు

ఖజానా ఉద్యోగులపై వేటు

ఎస్టీవో, సూపరింటెండెంట్ సస్పెన్షన్

సాక్షి ఎఫెక్ట్

చీరాల టౌన్: తమకు కాసులు వచ్చే సీట్లు దక్కలేదని ఖజానా ఉద్యోగులు పెన్‌డౌన్ చేయడయమే కాదు.. బిల్లుల్ని కూడా పాస్ చేయనందున పలువురు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఖజానా ఉద్యోగుల తీరు, పెండింగ్ బిల్లులపై 'సాక్షి' విపులంగా కథనాన్ని ప్రచురించింది. దీంతో జిల్లా కలెక్టర్ వెంకట మురళి స్పందించారు. చీరాల ఎస్టీవో భాగ్యలక్ష్మిని, సూపరింటెండెంట్ సుధీరలను సస్పెండ్ చేశారు. ఇద్దరు ఉద్యోగులను నెల్లూరు జిల్లాకు, ఒకరిని గిద్దలూరు ట్రెజరీ కార్యాలయానికి, ఒకరిని కనిగిరి ఎస్టీవో కార్యాలయానికి బదిలీ చేశారు. చీరాలకు రెగ్యులర్ ఉప ఖజనా అధికారిగా నియమించే వరకు ఇన్‌చార్జిగా బాపట్ల ఎస్టీవో సుబ్బారావుకు బాధ్యతలు అప్పగించారు. అక్రమార్జనకు, కాసులకు కక్కుర్తిపడి ఉద్యోగులు బిల్లులు, కాంట్రాక్టు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు గురిచేసిన ఖజానా ఉద్యోగులకు జిల్లా కలెక్టర్ భరతం పట్టారని, మిగిలిన అన్ని శాఖలపై కలెక్టర్ దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శనివారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **7,000** గరిష్ఠం : రూ. **9,000**

మోడల్ ధర రూ. **8,000**

క్లుప్తంగా

పొన్నూరులో 40.8 మి.మీ. వర్షపాతం

కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా పొన్నూరు మండలంలో 40.8 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా కాకుమాను మండలంలో 3 మి.మీ. పడింది. జిల్లా సగటున 7 మి.మీ.గా నమోదైంది. పెదనందిపాడు మండలంలో 16.8, కొల్లిపర 12.4, మేడికొండూరు 9, వట్టిచెరుకూరు 8.8, దుగ్గిరాల 7.6, ప్రత్తిపాడు 7.2, పెదకాకాని 5.8, ఫిరంగిపురం 5.6, గుంటూరు తూర్పు 4.2, గుంటూరు పశ్చిమలో 4 మి.మీ. వంతున వర్షపాతం పడింది. సెప్టెంబర్ 21వ తేదీ నాటికి జిల్లా సాధారణ వర్షపాతం 101.7 మి.మీ. కాగా, ఇప్పటి వరకు 235.1 మి.మీ.గా నమోదైంది.

ఏసీఏ మ్యాచ్‌కు వర్షం దెబ్బ

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ ఎస్‌కెఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఏసీఏ ఇంటర్ జోనల్ క్రికెట్ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించింది. మ్యాచ్‌లో భాగంగా శనివారం సెంట్రల్ జోన్, నార్త్ జోన్ మధ్య ప్రారంభమైన మ్యాచ్ తొలిరోజు ఆట మూడు ఓవర్లకే పరిమితమైంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న సెంట్రల్ జోన్ బ్యాటింగ్‌కు దిగి మూడు ఓవర్లలో ఆరు పరుగులు చేసింది. ఈ సమయంలో వర్షం రావటంతో అంపైర్లు తొలిరోజు ఆటను నిలిపివేశారు. ఆదివారం రెండవ రోజు ఆట కొనసాగనుంది.

విద్యార్థులకు వరం కౌండిన్య ఐఏఎస్ అకాడమీ

శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు



కోచింగ్ పూర్తి చేసుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

పెదకాకాని: అతి తక్కువ ఫీజులతో భోజన వసతి కల్పిస్తూ పోటీ పరీక్షల్లో అత్యున్నత శిక్షణ అందిస్తున్న కౌండిన్య ఐఏఎస్ అకాడమీ విద్యార్థులకు కల్పవృక్షంగా మారిందని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల కౌండిన్య ఐఏఎస్ అకాడమీ బ్యాంకింగ్ పరీక్ష కోసం నిర్వహించిన శిక్షణలో మొదటి బ్యాచ్ విద్యార్థుల వీడ్కోలు సభకు శనివారం ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. అకాడమీ వ్యవస్థాపకులు, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ ఈవీ నారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్, రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, ఎల్ఐసీ, బ్యాంకింగ్ రంగాలలో ఉద్యోగాలకు ఉత్తమ శిక్షణ ఇవ్వడంలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ఆదర్శనీయంగా ఉందన్నారు. విద్యార్థులు నిరంతరం పట్టుదలతో ఇష్టపడి చదివి పోటీ పరీక్షలలో విజయం సాధించాలన్నారు. అకాడమీ అందిస్తున్న కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ ఈవీ నారాయణ 20 సంవత్సరాల క్రితమే కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్టును ఏర్పాటు చేశారన్నారు. రూ.2.25 కోట్ల మూలధనాన్ని సమకూర్చి ఇప్పటి వరకు ప్రతిభ గల పేద విద్యార్థులకు రూ.రెండు కోట్ల మేరకు ఉపకార వేతనాలు అందించడం అభినందనీయం అన్నారు. విద్యార్థులలో నైపుణ్యాలను పెంపొందించడం కోసం రూ.7 కోట్ల విరాళాలు సేకరించి కౌండిన్య ఐఏఎస్ అకాడమీని గ్రామీణ ప్రాంతంలో ఏర్పాటు చేయడం హర్షణీయం అన్నారు. విద్యార్థులు అకుంఠిత దీక్షతో అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ నారాయణ ప్రసంగిస్తూ.. ప్రతిభ గల పేద విద్యార్థులను ఆదుకోవడమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని తెలిపారు. రూ.50 లక్షలతో డాక్టర్ ఈవీ నారాయణ చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి, దాని ద్వారా పేద విద్యార్థులకు నైపుణ్యాలను అందించడానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కేఎస్ లక్ష్మణరావు రచించిన 'సివిల్ సర్వీసెస్ ప్రాథమిక అంశాలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రతులను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కౌండిన్య ఐఏఎస్ అకాడమీ ప్రతినిధులు వాకా రామ్‌గోపాల్ గౌడ్, చిలక చంద్రమౌళి, బెల్లంకొండ సదాశివ గౌడ్, పామర్తి సాంబశివ రావు, వీరంగి రంగారావు, వేముల శేషాచలం, డాక్టర్ కృష్ణ, డాక్టర్ తాతా సాంబశివ రావు, వడ్డెంగుంట సుబ్బారావు, బొబ్బిళ్ళ వెంకటేశ్వర రావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సత్తా చాటిన కృష్ణా జిల్లా గిత్తలు


పోటీల్లో బండలాగుతున్న గిత్తలు

ప్రత్తిపాడు: నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో నందమూరి తారక రామారావు మెమోరియల్, నూతలపాటి పరమేశ్వర రావు మెమోరియల్ ఆధ్వర్యంలో జరుగుతున్న బండలాగుడు పోటీల్లో కృష్ణా జిల్లా ఎడ్లు సత్తా చాటాయి. శనివారం సబ్ జూనియర్స్ విభాగంలో గుంటూరు, కృష్ణా, పల్నాడు, ప్రకాశం, నంద్యాల, తెలంగాణ నుంచి పది జతలు పాల్గొన్నాయి. వీటిలో కృష్ణా జిల్లా బాపులపాడు మండలం మల్లవల్లికి చెందిన అక్కినేని సత్యచౌదరి గిత్తలు 4,500 అడుగుల దూరం బండ లాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా ఇంకొల్లు గ్రామానికి చెందిన నల్లూరి కృష్ణయ్య గిత్తలు 3,900 అడుగులు లాగి ద్వితీయ స్థానాన్ని, పల్నాడు జిల్లా నాదెండ్లకు చెందిన దేవభక్తుని శ్రీకాంత్ చౌదరి గిత్తలు 3757.2 అడుగులు లాగి తృతీయ స్థానం, నంద్యాల జిల్లా పాణ్యం మండలం ఎస్ కొత్తూరుకు చెందిన బీరం సుబ్రమణ్యేశ్వర రెడ్డి గిత్తలు 3631.4 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచాయి. విజేతలకు స్థానిక శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు నగదు బహుమతులు, మెమెంటోలు అందజేశారు.

24న రెజ్లింగ్ జిల్లా జట్టు ఎంపిక

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-19 రెజ్లింగ్ జిల్లా జట్టుకు క్రీడాకారుల ఎంపిక ఈ నెల 24వ తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఫెడరేషన్ కార్యదర్శి గుంటూరు నరసింహారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అచ్చంపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల కళాశాల, మోడరన్ పెంటాథ్లాన్ ఎంపికలు గోరంట్లలోని నెక్స్‌జెన్ పాఠశాలలో జరుగుతాయని పేర్కొన్నారు. 28న త్రోబాల్ ఎంపికలు బాపట్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల, చిలకలూరిపేటలోని ఏఎంజీ స్కూల్లో బాస్కెట్‌బాల్, బాక్సింగ్ ఎంపికలు ఉంటాయని వివరించారు. 2006 జనవరి ఒకటో తేదీ తరువాత జన్మించిన వారు అర్హులని, పదో తరగతి మార్కుల జాబితా జిరాక్స్‌పై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకంతో హాజరు కావాలని సూచించారు.

ఔత్సాహిక వ్యాపారవేత్తలకు అన్నివిధాలా అండ



నరసరావుపేట ఈస్ట్: నూతనంగా వ్యాపారం ప్రారంభించే నిరుద్యోగ యువతకు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అండగా ఉంటుందని జిల్లా అధికారి కె.సంజీవరావు స్పష్టం చేశారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ కార్మిక సంస్థ సౌజన్యంతో ఔత్సాహిక వ్యాపారవేత్తలకు ఐదు రోజులుగా వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ముగింపు సమావేశంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి సంజీవరావు మాట్లాడుతూ బ్యాంకు రుణాలు పొందటంలో సహకారం అందిస్తామన్నారు. కావలసిన ధ్రువీకరణ పత్రాలు, ప్రభుత్వ రాయితీ తదితర అంశాలను తెలిపారు.

శిశువు మృతిపై బంధువుల ఆందోళన


మృత శిశువుతో బంధువులు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): పండంటి మగబిడ్డ పుడితే.. మృత శిశువును చేతిలో పెట్టారంటూ ప్రభుత్వాస్పత్రి మాతాశిశు విభాగంలో బంధువులు ఆందోళనకు దిగారు. మృత శిశువు తమ బిడ్డేనా అంటూ అనుమానం వ్యక్తం చేశారు. దీంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన బి.ఐశ్వర్యకు పురిటినొప్పులు రావడంతో ప్రసవం కోసం శుక్రవారం మధ్యాహ్నం విజయవాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆమెకు రాత్రి ఏడు గంటల సమయంలో సిజేరియన్ చేసి, పుట్టిన మగశిశువును చికిత్స నిమిత్తం స్పెషల్ న్యూబార్న్ కేర్ యూనిట్‌కు తరలించారు. ఆ సమయంలో శిశువును తండ్రి మనోహర్‌కూ చూపలేదు. శిశువు ఆరోగ్యంగానే ఉన్నట్లు చెప్పారని ఐశ్వర్య తల్లి, బంధువులు పేర్కొన్నారు. శనివారం ఉదయం కూడా ఇదే తీరుగా వ్యవహరించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో గుండెలో రంధ్రం ఉన్నట్లు చెప్పిన వైద్యులు, పది నిమిషాలకే మృతి చెందినట్లు పేర్కొన్నారు. దీంతో బంధువులు ఆందోళనకు దిగారు. ఈ విషయం తాడేపల్లిలో ఉన్న వారి సంబంధికులకు తెలియడంతో మరింత మంది ఆస్పత్రికి చేరుకున్నారు. దీంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.వెంకటేష్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.వినయ్‌కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ యు.శోభలు.. ఐశ్వర్య బంధువులను పిలిచి శిశువు ఆరోగ్య పరిస్థితిని వివరించారు. దీంతో రాత్రి 7.30 గంటల సమయంలో గొడవ సర్దుమణిగింది. శిశువు పుట్టగానే స్క్రీనింగ్ చేసి లోపాలు ఏమైనా ఉన్నాయేమో గుర్తించాల్సి ఉంది. కానీ శుక్రవారం రాత్రి 7.30 గంటలకు జన్మించిన శిశువుకు శనివారం మధ్యాహ్నం రెండు గంటల వరకూ ఎందుకు స్క్రీనింగ్ చేయలేదనేది ప్రశ్నగా మారింది. పుట్టిన తర్వాత 18 గంటలకు లోపాన్ని గుర్తించడం, శిశువును బంధువులు ఎవరికీ చూపించకపోవడమే వివాదానికి దారితీసింది.

గురజాడ సాహిత్యం అజరామరం


సుందరరావుకు పురస్కారం ప్రదానం చేస్తున్న దృశ్యం


గురజాడ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ భార్గవ్ తేజ తదితరులు

నగరంపాలెం: గురజాడ అప్పారావు సాహిత్యం అజరామరం అని, అత్యంత సరళమైన భాషలో సామాన్యుడికి కూడా అర్థమయ్యేలా అనేక రచనలు చేశారని వక్తలు పేర్కొన్నారు. స్నేహ ఆర్ట్స్ (వింజనంపాడు) ఆధ్వర్యంలో గురజాడ అప్పారావు జయంతి వేడుక, సాహితీ పురస్కార ప్రదానోత్సవం శనివారం సాయంత్రం జరిగింది. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని పద్మావతి కళ్యాణ వేదికపై ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత నాటకరంగ పరిశోధకులు డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు, రంగస్థల ప్రముఖులు వై.ఎస్.కృష్ణేశ్వరరావు, పాలక మండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. రచయిత, దర్శకులు నెమలికంటి వెంకటరమణ అధ్యక్షత వహించారు. అనంతరం తెలుగు నాటక రంగానికి విశేష కృషి చేసిన నాటక రచయిత వాడ్రేవు సుందరరావుకు మహాకవి గురజాడ సాహితీ పురస్కారం ప్రదానం చేసి, సత్కరించారు. స్వర్ణభారతి కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో నెమలికంటి వెంకటరమణ రచన, దర్శకత్వం వహించిన 'మీరైతే?' నాటిక ప్రదర్శన సందేశాత్మకంగా సాగింది. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, జి.సాంబశివరావు, షేక్ చిన ఆదాం షఫి, బి.గోపాల్‌రెడ్డి, వెనిగండ్ల మధు, ఆమంచి వెంకట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు వెస్ట్: అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ వెంకట అప్పారావు 162వ జయంతిని పురస్కరించుకుని జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. డీఆర్వో పెద్ది రోజా, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీపీఎం లక్ష్మీకుమారి, ఏఓ పూర్ణచంద్రరావు, సెక్షన్ సూపరింటెండెంట్ ఇస్మాయిల్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మా భూమికి రక్షణ కల్పించండి

- టీడీపీ నాయకుడు బెదిరిస్తున్నాడు
- పోలీసులను ఆశ్రయించిన కుటుంబం


శంకరరావు కుటుంబసభ్యులు

వినుకొండ(నూజెండ్ల): మా భూమికి రక్షణ కల్పించండి, టీడీపీ నాయకుడు తమ భూమిని ఆక్రమించి తమను బెదిరిస్తున్నాడంటూ వినుకొండకు చెందిన వ్యాపారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారసత్వంగా వచ్చిన ఆస్తిని అక్రమంగా కొందరు ఆక్రమించుకునేందుకు చూస్తున్నారని అదేమని ప్రశ్నిస్తే దాడులు చేసేందుకు సిద్ధమయ్యారని పట్టణానికి చెందిన వ్యాపార వేత్త అవ్వారు శంకరరావు కుటుంబసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని మార్కాపురం రోడ్డులోని చెక్‌పోస్టు సెంటర్ వద్ద ఉన్న 80 సెంట్ల స్థలం 1946 నుంచి తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిందని, అందులో 44 సెంట్ల భూమిని 2021లో ముండ్లమూరు మండలానికి చెందిన టీడీపీ నాయకుడు మందడం వెంకట్రావుకి విక్రయించామని, అయితే ఆ స్థలంలోని ఒకటిన్నర సెంటు భూమిలో తమ పూర్వీకుల సమాధులు ఉన్నాయని, ఆ స్థలం కూడా కబ్జా చేసి ఆక్రమించుకునేందుకు వెంకట్రావు అనుచరులు తమ మేనేజర్‌పై దాడికి యత్నించారని తెలిపారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. కార్యక్రమంలో రంగారావు, వెంకట్రావు, శివప్రసాద్, మహేశ్వరరావు, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆట్యా-పాట్యా చాంపియన్ రోహిత్‌కు అభినందన


రోహిత్‌ను అభినందిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: భూటాన్ దేశంలో నిర్వహించిన ఎనిమిదో దక్షిణ ఆసియా ఆట్యా-పాట్యా చాంపియన్‌షిప్ పోటీల్లో దేశం తరఫున పాల్గొని ప్రథమ స్థానం పొందిన ఉన్నం రోహిత్ జోయల్‌ను జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అభినందించారు. శనివారం కలెక్టరేట్‌లో తాను సాధించిన కప్‌తో జోయల్ జిల్లా కలెక్టర్‌ను కలిశారు. పోటీలలో నరసరావుపేటకు చెందిన రోహిత్ పాల్గొనగా, ఆయన లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూలు సీనియర్ పీడీ ఝాన్సీరాణి కుమారుడు కావటం మరో విశేషం. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతీ, ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియచేయగా, ఏపీ ఆట్యా-పాట్యా అసోసియేషన్ సీఈవో రంభా దుర్గాప్రసాదు, సెక్రటరీ రంభా శ్రీచరణ్, అధ్యక్షులు చావేజ్, కోచ్ పుల్లయ్య అభినందనలు తెలిపారు.